# ఆత్మ సౌందర్యం

కోలపల్లి ఈశ్వర్



**వర్షం... రెండు రోజుల నుండీ విడవకుండా... పగబట్టినట్టుగా కురుస్తోంది. ఊరు ఊరంతా నీటిలో ముంచి తీసిన ఆకుపచ్చ మఖ్‌మల్ వస్త్రంలా ఉంది. నేలంతా బురద... దారంతా మట్టి కలిసిన ఎర్రటి నీళ్ళు... పాయలుగా పారుతూ... అంతా చిత్తడిగా వుంది.**


చలిగాలి రివ్వున విసిరికొడుతున్నప్పుడల్లా చెట్ల కొమ్మలు భారంగా వూగుతూ, నీటిబొట్లు ముత్యాల్లా ఎగిరి పడిపోతున్నాయి.

అది పగలే అయినా అటు వెలుతురూ, ఇటు చీకటీ కాని వర్షం... పలుచని బట్టలో నుండి బయటకు చూస్తే కనిపించే దృశ్యంలా. టైమ్ ఎంతయిందీ వూహించలేని వాతావరణం.

అడుగులో అడుగేస్తూ నడుస్తున్న శర్మ... ఆ పాక వద్దకు రాగానే ఆగి లోపలికి చూశాడు. తడికెలతో మడికట్టిన మట్టి ఇల్లు అది. పైన తాటాకు కొమ్మల కప్పు. దానిపై చెదురు మదురుగా పరచిన ఎండుగడ్డి. ఇంటి ఆవరణలో పొదల్లా ఏవేవో చెట్లు... ఒక పక్కన బావీ వున్నాయి. బావి ప్రక్కన ఒక నీటి డ్రమ్ము, బకెట్టు, వంటపాత్రలూ ఉన్నాయి.

తడికె తలుపు తీసుకుని బురదను తప్పించుకుంటూ చిన్నగా లోన అడుగుపెట్టాడతను. అతని గోధుమ రంగు ప్యాంటూ, చొక్కా అప్పటికే బాగా తడిసిపోయి, బురద చిమ్మబడి వున్నాయి. తలపైనుండి నీళ్ళు ధారలు కారుతూ ఉండగా... చేత్తో నుదుటి మీది నీటిని తొలగించుకుంటూ... పాక తలుపు వద్దకి చేరాడు.

తలుపు తీసే వుంది. లోపల బాగా చీకటిగా ఉంది. ఏమీ కనిపించడం లేదు.



పెరటి వైపు తలుపు తోసుకుని ఎవరో లోనికి వస్తున్నట్టు అనిపించి వారి వంక చూడడానికి ప్రయత్నించాడు. ఆ ఆకారం ఒక ప్రక్కకి వెళ్ళి గోడకి తగిలించి వున్న లాంతరునందుకొని, మినుకు మినుకుమంటూ వెలుగుతున్న వత్తిని పెద్దది చేయడంతో ఆ వెలుగులో వచ్చింది ఒక స్త్రీ అని తెలుసుకోగలిగాడు.

పరీక్షగా చూశాడు. ఆవిడ నడివయసు స్త్రీలా ఉంది. తలనిండా కొంగు కప్పుకొని ఉంది. పాత నూలు చీర... జల్లులో తడిసినట్టుగా అక్కడక్కడా ముద్దముద్దగా వంటికి అతుక్కుంది. ఆవిడ నడుస్తుంటే కాలి పట్టా గొలుసులు చిన్నగా వింత ధ్వనిని పుట్టిస్తున్నాయి.

శర్మ తన ఉనికిని తెలియజేస్తూ చిన్నగా దగ్గాడు. ఆవిడ అతని వైపు వచ్చి అతని మొహంలోకి చూస్తూ "ఎవరూ?" అంది.

"నా పేరు శర్మ. మాదీ వూరు కాదండి" అంటూ లోనికి రావచ్చా అన్నట్టుగా చూస్తుంటే... అతని భావం గ్రహించిన దానిలా ఆవిడ "లోనికి రండి" అంది.

ఇప్పుడు ఆ మసక కాంతిలో శర్మ లోపలి వస్తువుల్ని చూస్తుంటే... ఆవిడ ఒక పాత ముక్కాలి పీట తెచ్చి గోడ పక్కగా వేసి... తను కాస్త దూరం జరిగి నిల్చుంది. అతను పీటపై కూర్చున్నాడు.

"నేనొక రచయితను. రంగనాథపురంలో ఉన్న నా స్నేహితుడి ఇంటికి బయలుదేరాను. బస్సు చెడిపోవడంతో ఇక్కడ దిగవలసి వచ్చింది. మళ్ళీ రేపటి వరకూ బస్సు దొరికే అవకాశం లేదన్నారు. ఈ వర్షంలో ఎక్కడికి వెళ్ళగలను! అందుకే ఆశ్రయం కోసం ప్రయత్నిస్తూ వచ్చాను. ఒకరిద్దరి ఇళ్ళలో అడిగితే తమ ఇంట్లో కుదరదు, ముందుకెళ్ళమని చెప్పగా ఇటువైపు వచ్చాను. మీరేమీ అనుకోకపోతే ఇక్కడ తలదాచుకుని ఉదయం ఏదో ఒక విధంగా వెళ్ళిపోతాను. దయచేసి కాదనకండి..." అతని గొంతు గాద్గదికమైంది.

"మీదేవూరు?" అందావిడ. చెప్పాడు శర్మ.

ఎందుకో ఆవిడ ఇబ్బందిగా అటూ ఇటూ చూడసాగింది. ఏమీ మాట్లాడలేదు. కాసేపయ్యాక అంది-

"మీకిది అనువైన చోటో కాదో... కానీ మరెవరూ ఆశ్రయం ఇవ్వడానికి కుదరదంటున్నప్పుడు... చూస్తూ చూస్తూ మిమ్మల్ని వెళ్ళిపొమ్మని ఎలా అనేది! సరే...అలాగే ఉండండి. కానీ ఇక్కడున్నందుకు ఆ తరువాత బాధపడాల్సి వస్తే అందుకు నేను బాధ్యురాలిని కాను"


శర్మకి ప్రాణం లేచివచ్చినట్టనిపించినా... ఆ చివర్లో ఆవిడ అన్న మాట అతన్ని ఆశ్చర్యంలో పడవేసి, మదిలో అనుమానాన్ని రేకెత్తించింది. ఆవిడ అలా ఎందుకంటున్నదీ తెలుసుకోవాలని అతని మనసు తహతహలాడింది. కానీ వెంటనే తన సందేహాన్ని అడిగితే ఆవిడ చిరాకు పడి ఏదైనా అనేసి... ఈ అమూల్యమైన అవకాశం కూడా చేజారిపోతుందేమోననే భయంతో మౌనం వహించాడు. ఆవిడ లోనికి నడిచింది.

కొద్దిసేపటి వరకూ శర్మకు ఏదీ అంతు బట్టలేదు. ఈ ఇంట్లో ఎవరెవరున్నారు? ఈవిడెవరు? ఈవిడ మాటలకర్థం ఏమిటి? ఈ ప్రశ్నలకావిడే సమాధానం చెప్పాలి.

లోపల మరో రెండు గదులున్నట్టున్నాయి. అందులో ఒకటి వంటగది, మరొకటి పడుకోవడానికి ఉపయోగించేది అయివుంటుందనుకున్నాడు.

అక్కడంతా నిశ్శబ్దంగా వుంది... కానీ ఆ నిశ్శబ్దానికి అలంకరణగా... మూలకి వున్న ఒక పెద్ద గంప కింద నుండి కోళ్ళు చేస్తున్న చప్పుడు. చలికి లోపల సర్దుకోలేక అవి చిన్నగా గొడవ పడుతున్నట్టున్నాయి. ఆవిడ లోపల వంట ప్రయత్నాలు ప్రారంభించినట్టుగా పాత్రల సవ్వడి.

అంతలో ఆవిడ ఒంటిపై ఒక పాత దుప్పటి వంటిది కప్పుకుని నూతి వద్దకు వెళ్ళింది. అయిదు నిముషాల్లో పాత్రల్ని తోముకుని వాటిని తీసుకుని లోపలికి వెళ్ళింది.




ఆవిడని ఒక కంట గమనిస్తూనే వున్నాడు శర్మ. శరీరం నిండుగా కప్పుకుని వున్న దుప్పటి కారణంగా ఆవిడ ఎలా వుందో గమనించడం కష్టమే అయింది కానీ... ఆమె మొహం మాత్రం చాలా మామూలుగా, చామన ఛాయలో వుంది. ఆ నుదుటన పెద్ద బొట్టు, విశాలమైన కళ్ళు, ముక్కుకి చిన్న ముక్కు పుడక మాత్రం స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఆవిడ లోపల నుండి ఒక నులకమంచం తెచ్చి అతని పక్కన పెట్టి, ఒక తువ్వాలును ఆ మంచంపై వేసి, లోనికి వెళుతూ "ఒళ్ళు తుడుచుకుని, ఆ మంచం వేసుకుని విశ్రాంతి తీసుకోండి" అంది. అతడామె చెప్పినట్టే చేశాడు.

అయిదు నిముషాల్లో అతను నిద్రాదేవి ఒడిలో వాలిపోయాడు. మళ్ళీ స్పృహలోకి వచ్చేసరికి అతనికేవో మాటలు వినిపించసాగాయి. మధ్యలో పాత్రలు జరుపుతున్న చప్పుడు. అతను కళ్ళు తెరచి వినసాగాడు.

"చేపల పులుసు నీలా వండడం దాని కస్సలు చేతకాదు. ఇంకాస్త వడ్డించు పంకజం".

"అలాగే, నాలుగు ముక్కల్ని టిఫిన్లో పెట్టివ్వనా... సూర్యం కోసం."

"ఊ... నీ చేతి వంట వాడికి ఇష్టంగానే వుంటది. కానీ ఆ మూర్ఖురాలికి నీ అమృత ప్రాయమైన వంట తినే అదృష్టం లేదు. దానిది ఒంటి మెరుపే గానీ మనసు మురికి."

"ఎందుకలా అంటారు! ఎవరిష్టం వారిది"

"అవునూ... ఆయనకి తినడానికేమైనా ఇచ్చావా లేదా? పాపం ఎప్పుడనగా తిన్నాడో ఏమో కదా!"

"అతను... అతనేమనుకుంటాడో ఏమో... నిన్న మీరిచ్చి వెళ్ళిన అరటి పళ్ళు అలాగే వున్నాయి. వాటినే ఆయన మంచం పక్కన పెట్టాను."

"అరటి పళ్ళు తింటే కడుపు నిండుతుందా! అన్నం పెట్టు..."

"తప్పండీ... తిన్నాక అతనికి అసలు విషయం తెలిస్తే... అసహ్యంతో తిన్నదంతా కక్కేస్తే...? అది మరింత బాధ కలిగిస్తుంది. అంతగా ఆకలిగా వుంటే సాయంత్రం ఆ రావులమ్మ హోటల్లో ఏవైనా బజ్జీలో, వడలో తినివస్తాడు."

శర్మకి వాళ్ళు తన గురించే మాట్లాడు కుంటున్నారని అర్థమైపోయింది. చటుక్కున లేచి పక్కకి చూశాడు. ముక్కాలి పీటపై అరటి పళ్ళున్నాయి.

అతను... ఈ పంకజంకేమవుతాడు? సూర్యం ఎవరు? ఆవిడ తనకి భోజనం పెట్ట లేనని ఎందుకంటోంది? వెంటనే ఈ ప్రశ్నలకి సమాధానాలు తెలుసుకోవాలని అతని మనసు ఆరాటపడుతుండగా లేచి కూర్చున్నాడు.

అప్పుడే ఆయన బావి దగ్గర చేతులు కడు క్కుని లోనికి వస్తున్నాడు. మనిషి మధ్య వయ స్కుడు. చీటీ బనీను, ధోవతి కట్టుకుని వున్నాడు. చేతులు తుడుచుకుంటూ శర్మని చూశాడు.

"లేచారా..." అంటూ వచ్చి మంచంలో శర్మ పక్కన కూర్చున్నాడు.

"మీకు ఉదయం ఆరుగంటలకి బస్సు ఉంది. పంకజం మీ గురించి చెప్పింది. మీరు ఈ పళ్ళు తినండి. తరువాత భోజనం విషయం ఆలోచించవచ్చు" అన్నాడతను.

"మీరు...?" ప్రశ్నార్థకంగా చూశాడు శర్మ. అతను చిన్నగా నవ్వాడు. "నా పేరు సుబ్బయ్య. పంకజం నా భార్య." అంటూ ఏదో పనున్నట్టుగా లోనికి వెళ్ళాడతను మళ్ళీ.

తరువాత కొద్ది సేపటికి చేతిలో ఒక సంచీతో బయటకు వస్తూ "నేను వెళుతు న్నానండీ... మీరు హాయిగా రెస్టు తీసుకోండి. నేను మా అబ్బాయి సూర్యంతో భోజనం పంపి స్తాను" అంటూ చకచకా బయటకు వెళ్ళి పోయాడు సుబ్బయ్య.

శర్మ అరటిపళ్ళు తిన్నాక మూలకి వున్న కూజాలో నుండి గ్లాసులో నీళ్ళు ఒంపుకుని తాగాడు. బయట వర్షం తగ్గడం లేదు. ఏమీ తోచడంలేదు. అంతా అయోమయంగా వుంది. ఆలోచనల్లో పడ్డాడు.

పంకజం సుబ్బయ్య భార్యే అయినపుడు... అతను మరెవరి గురించో చెప్తున్నాడు... మరి ఆవిడెవరు? అతను వేరే భోజనం ఎలా పంపిస్తాడు?

ఒక రచయితగా అతడామె కథని అనేక కోణాలనుండి ఆలోచించసాగాడు. ఒక వేళ ఈమె ఏ తక్కువ కులం స్త్రీయో అయి వుంటుందా? అతనీవిడనిక్కడ వుంచి... మరో చోట మరొకరితో కాపురం చేస్తున్నాడా?

## పెట్టే చేతినే కరిచిన దుర్మార్గుడు

**ఈ** మధ్య నెదర్లాండ్‌లో జరిగిన ఒక సంఘటన ఎవరికైనా ఆశ్చర్యం కలిగిస్తుంది. నెదర్లాండ్‌లోని ఆమ్‌స్టర్‌డామ్ పట్టణంలో ఈ మధ్యనే 34 ఏళ్ళ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతను తనకి సహాయం చేయబోయే ఇంకొక మనిషి మీద దాడి చేసి అతని సొత్తు దొంగిలించబోయాడనే నేరం మీద. తమాషా ఏమంటే అరెస్టయిన మనిషి తానుగా నడవలేడు, చక్రాల కుర్చీలోనే (వీల్ ఛైర్) వెళ్తూ ఉంటాడు. సంఘటన వివరాలిలా ఉన్నాయి. ఒక సాధు తత్వం గల మనిషి తన ఇంటిలో కూర్చుని ఒక వ్యక్తి చక్రాల కుర్చీలో తన ఇంటి ముందు వెళ్తూ ఉండగా అతని కుర్చీ చక్రాల టైరులో నుంచి గాలిపోయి బాధపడుతూ ఉండటం చూశాడు. ఆ మనిషి జాలిపడి ప్రేమతో, ఆ వ్యక్తిని తన ఇంటిలోకి వచ్చి కాఫీ తాగి వెళ్ళవల సిందిగా ఆహ్వానించాడు. ఆ వ్యక్తి ఇంటిలోకి వస్తూనే ఇల్లుగలాయనని డబ్బిమ్మని కోరాడట. ఆయన లేదనటంతో వెంటనే ఆయన మీదకి దూకి, ఆయనని కత్తితో పొడిచాడట. ఇద్దరూ కిందపడి కలియబడుతూ దొర్లుతూంటే శబ్దం విని ఇరుగు పొరుగువారు పోగయి పోలీసులని పిలిచారు. పోలీసులు వెంటనే కత్తితో పొడిచిన వీల్‌ఛైర్ మనిషిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారట. ఇందులో సంచలనాత్మకమైన విషయమేమంటే ఇల్లుగలాయన కూడా తొమ్మిది సంవత్సరాలు వీలు ఛైర్‌లో గడిపి ఈ మధ్యనే కృత్రిమ కాళ్ళు పెట్టించుకున్నాడట. పుణ్యానికి పోతే పాపం ఎదురైంది అంటే ఇదే కాబోలు.

\- వి.కె. మోహన్

సాయంత్రం ఆ సూర్యం అనే అబ్బాయి రానే వచ్చాడు. ఒక బ్యాగును శర్మకందించి మరేమీ మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. అతడికి పదేళ్ళుండొచ్చు. ఆ అబ్బాయిని పిలిచి వివరాలు కనుక్కుందామనుకొని... బావుండ దేమోనని ఆగిపోయాడు శర్మ.

బ్యాగులోవున్న అరటి ఆకును బయటకు తీశాడు. మంచం పక్కగా నేలపై కూర్చుని క్యారియర్ విప్పి భోజనం వడ్డించుకున్నాడు. చిత్రంగా ఆ క్యారియర్‌లోనూ చేపల కూర వుంది. ఆ కమ్మని వాసన అతన్ని ఇక మరేమీ ఆలోచించనీయలేదు. వెంటనే చేపల కూర, గడ్డ పెరుగుతో తృప్తిగా భోజనం పూర్తి చేశాడు.

ఆకు పారేసి బావి దగ్గర చేతులు కడుక్కుని, నీళ్ళు తాగి వచ్చాడు. ఆమె లోపల వుండగానే తనకు తానే వడ్డించుకు తినడానికి కారణం... అతను వాళ్ళ సంభాషణని విని వుండడమే. ఏదో కారణంగా ఆవిడ ఇబ్బంది పడుతోందని అతడు గ్రహించాడు.

మళ్ళీ మంచంపై మేను వాల్చాడు. పంకజం లోపలినుండి బయటకు రావడమే లేదు. చీకటి పడింది. ఆవిడ మరో రెండు లాంతర్లు వెలిగించి ఇంటి బయట, లోపలి గదిలోనూ పెట్టి వెళ్ళింది. తరువాత యథా ప్రకారం వంట పనులు మొదలెడుతోంటే శర్మ అడిగాడు లోపలవున్న ఆమెని...

"సుబ్బయ్యగారు ఎప్పుడొస్తారండీ?"

"ఆయనిప్పుడు రారండీ"

"అయ్యో... మరి నేనిక్కడ... మరో మనిషి లేకుండా ఈ ఇంట్లో రాత్రివేళ వుండడం... మీకు ఇబ్బందిగా వుండదూ?"

"ఫరవాలేదు. అలాంటి ఇబ్బందేమీ లేదు. మీరు నిశ్చింతగా పడుకోండి. ఆకలిగా వుంటే..."

"లేదు లెండి... ఇప్పుడే రుచికరమైన భోజ నం కడుపునిండా తిన్నాగా. ఇంక ఆ అవసరం లేదు."

ఆమెతో ఇక ఏమి మాట్లాడాలో అర్థంకాక అలాగే మౌనంగా వుండిపోయాడు. ఈ విచిత్ర మైన ఇంటి పరిస్థితిలో... ఇలా కాలం గడప వలసి రావడం తమాషాగా అనిపించిందతనికి. ఆ రాత్రి ఇంక ఏ విశేషమూ జరగకుండానే తెల్లవారింది.

ఉదయం ఆరు గంటలకల్లా ప్రయాణానికి సిద్ధమైన శర్మ పంకజం కనబడగానే "ఇంక నే వెళ్ళి వస్తానండి. మీ ఋణం ఎలా తీర్చు కోవాలో తెలియడం లేదు. ఒక అపరిచితుడికి ఆశ్రయం ఇవ్వడం... అదీ ఒంటరిగా వున్న ప్పుడు... చాలా అరుదైన విషయం. మీకు నా కృతజ్ఞతలు" అన్నాడు చేతులు జోడించి.

ఆవిడ చిన్నగా నవ్వి "దానిదేముంది లెండి. నేను చేయగలిగిన పనిని నేను చేశాను" అంది.

శర్మ తన చేతి సంచీ తీసుకుని మరోసారి ఆవిడకి నమస్కరించి 'వస్తానండీ' అని చెప్పి



## మళ్లీ అమెరికా పయనం!

**హిం**దీలో చేస్తున్న ఓ సినిమా, కమల్ హాసన్‌తో నటిస్తున్న సినిమా పూర్తయితే మళ్లీ మనీషా కొయిరాలా సంవత్సరం పాటు అమెరికా వెళ్లిపోతుందట. అమ్మడు చాలా కాలం నుంచి అమెరికాలో ఫిల్మ్ మేకింగ్ కోర్స్ చేస్తోందిలెండి. అదింకా పూర్తి కాలేదట! ముందుగా ఒప్పందం కుదుర్చుకున్న ప్రకారం సినిమాలు చేయడానికి ప్రియుడు సెసిల్‌ని వెంటేసుకు ఇండియా వచ్చింది నేపాల్ సుందరి. ఇంతలోకి కమల్ సినిమా వచ్చిపడింది. దాంతో కోర్స్ చేయడానికి ఆలస్యమైపోతోందంటూ తెగ బాధపడిపోయింది!

బయటకు వచ్చేశాడు. అప్పటికి వర్షం తగ్గిపోయింది.

కొద్ది దూరం నడిచాక శర్మ అకస్మాత్తుగా ఆగిపోయాడు. తన మనసునిండా వున్న అనుమానాలకి జవాబులు తెలుసుకోకుండా వెళ్ళడం వల్ల ఏమి ప్రయోజనం! ఏమైతేనేం, తన సందేహాలని నివృత్తి చేసుకునే వెళ్ళాలి. ఇందులో తప్పేమీ లేదు. ఇలా తను తిరిగి వెనక్కి వచ్చి ఆ వివరాలన్నీ అడుగుతున్నందుకు క్షమాపణ కోరితే సరిపోతుంది. అంతే.

ఇలా నిర్ణయించుకున్న శర్మ... వెంటనే వెనుదిరిగి నిముషంలో పంకజం ఇంటికి వెళ్ళాడు. తలుపు పక్కకి జరిపి లోనికి వెళ్ళి గుమ్మం వైపుకి వెళ్ళబోతుంటే... అనుకోకుండా బయటకి వచ్చిన పంకజాన్ని చూస్తూనే శర్మ కొయ్యబారిపోయాడు. క్షణమే అది. కానీ ఎంత ఒళ్ళు గగుర్పొడిచే దృశ్యం!

ఆవిడ కుచ్చెళ్ళు ఎగదోపి... చేతిలో బిందెతో వుంది.

ఆవిడ మెడ భాగంనుండి పాదాలకి కొద్దిగా పై భాగం వరకు ఒళ్ళంతా కాలిపోయిన గుర్తుగా చర్మం... వడులుగా, ముడుతలుగా సాగుతోంది. కేవలం మొహం, చేతులు, పాదాలు మాత్రమే మామూలుగా వున్నాయి. మొత్తంమీద ఆవిడనలా చూడ్డం మాత్రం తట్టుకోలేని విధంగా వుంది.

కళ్ళు దించుకున్నాడు శర్మ. ఆవిడ వెంటనే చీర సరిచేసుకుని పైట నిండుగా కప్పేసుకుంటూ లోపలికి వెళ్లింది.

తలుపు వద్దకు వచ్చి నిలబడ్డ శర్మ... లోపల తలదించుకుని నిలబడిన పంకజాన్ని చూశాడు.

"క్షమించండి... నేను నిన్నంతా ఒక విషయం తెలుసుకోవాలని తపన పడ్డాను. ఇక్కడనుంచి వెళ్ళాక, ఆ సందేహం నివృత్తి చేసుకొనే వెళ్లాలనే ఆలోచన కలిగి వెనక్కి వచ్చాను. కానీ మిమ్మల్ని చూడగానే ఆ ప్రశ్నలన్నింటికీ జవాబు దొరికింది" బరువుగా నిట్టూర్చాడు శర్మ. మళ్ళీ తనే అన్నాడు...

"నాకు ఆశ్రయం ఇచ్చి, అన్నం పెట్టిన సోదరిగా మిమ్మల్ని అడుగుతున్నాను. మీకభ్యంతరం లేకుంటేనే చెప్పండి... మీరేదైనా అగ్నిప్రమాదంలో చిక్కుకున్నారా?"

పంకజం బదులుగా అంది... "నా పెళ్ళైన సంవత్సరానికి ఒకరోజు పిండి వంటలు చేశాక... వేడి నూనెతో వున్న బాణలిని గుడ్డతో ఎత్తి కిందపెట్టి వెళ్ళబోతూ చీర కుచ్చెళ్ళు కాలికి తట్టుకుని తూలి పడిపోయాను. అలా పడ్డ వెంటనే సంభాళించుకుని తిరిగి లేచాను. కానీ అనుకోకుండా బాణలికి తగలడం, అది దొర్లి నూనె కిందపడడంతో శరీరమంతా ఇలా కాలిపోయింది. ఎలాగో మొహం, చేతులు, పాదాలు మాత్రం నూనెకి తగలక విచిత్రంగా ప్రాణాపాయ స్థితినుండి బయటపడ్డాను.

ఆయనకు నేనంటే ఎంతో ప్రేమ. కానీ సంసారంలో సుఖం పంచలేని నాతో ఆయన బాధని చూడలేక, నా చెల్లెలితో ఆయనకి రెండో పెళ్ళి చేసి వేరేగా కాపురం వుంచాను. దానికి నేనంటే ఇష్టం లేదు. అందుకే నేనిలా ఒంటరిగా ఉంటున్నాను. నిన్న వచ్చి భోజనం ఇచ్చింది కూడా నా చెల్లి కొడుకే. అదీ జరిగిన కథ"

శర్మ తల ఎత్తి ఆమె కళ్ళలోకి చూశాడు. అతనికెంతో బాధగా అనిపించింది.

"మీరు చేయని తప్పుకి మీరెందుకు బాధపడాలి! నిన్న మీరు అన్నమాటలను బట్టి మీ ఆందోళన నా కర్థమయ్యిందిప్పుడు. నేను మిమ్మల్నిలా చూస్తే మీమీద అసహ్యంతోనో, జుగుప్సతోనో అన్నం తిననని మీరనుకున్నారు. కానీ అది పొరపాటంటాను నేను."

పంకజం ఈ మాటలకి ఆశ్చర్యంగా చూసింది.

"అవును... మీ భర్త కోరి కోరి మీ వంట మెచ్చుకుంటూ తృప్తిగా భోజనం చేస్తున్నప్పుడు, ఆ అబ్బాయి కూడా మీ వంట ఇష్టపడుతున్నప్పుడు... నేను మాత్రం మీ చేతి భోజనం ఎందుకు తినలేను! మీ శరీరానికి గాయం తగిలి తన సౌందర్యం కోల్పోయిందేమో కానీ.. మీ మనసు అందంగానే వుంది కదా! అయినా నిన్న నేను తిన్నది మీరు వండిన భోజనమే అని నాకు తెలుసు. మీ ఆయన ఆ భోజనాన్నే బయటనుండి ఆ అబ్బాయి ద్వారా పంపించాడని నాకర్థమైంది. నిజంగా మీ చేతి వంట అమృతమే".

పంకజంకి శర్మ మాటలు ఎంతో ఆనందాన్ని కలిగిస్తున్నాయి. ఇన్నాళ్ళూ తన శారీరక స్థితి కారణంగా తనలో తానే ఎంతగానో కుమిలిపోతోంది. కానీ ఈ రోజు తనకూ అందరిలాంటి గుర్తింపే వుందని శర్మ మాటలు ఋజువు చేస్తున్నాయి.

"మరోసారి ఎప్పుడైనా బస్సు చెడిపోకపోయినా ఈ వూరొచ్చి మీ ఆతిథ్యం స్వీకరించాలని వుంది. అంతే కాదు. మీకు, మీ వారికి మా ఆతిథ్యాన్ని కూడా ప్రతిగా ఇచ్చి ఋణం తీర్చుకునే అవకాశం కోసం ఎదురు చూస్తాను.

మీరు మాత్రం ఎప్పుడూ మీ మనసులో వున్న మీరుగానే వుండండి. పంకజం ఎప్పుడూ స్వచ్ఛంగానే వుంటుంది. మీరంటే మీ బాహ్య స్వరూపం కాదు. మీరంటే మీ ఆత్మ సౌందర్యమే.

ఇంక నే వస్తానూ... సెలవ్!" అంటూ అడుగులో అడుగేసుకుంటూ వెళ్ళిపోతున్న శర్మని కనుమరుగయ్యేదాకా అలాగే చూస్తూ వుండి పోయింది పంకజం. ❋